## నేడు జిల్లాకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

### మేడిగడ్డ బ్యారేజ్ సందర్శన.. ఆపై క్యాతన్‌పల్లిలోని బాల్క సుమన్ ఇంటికి..



మంచిర్యాల, జూలై 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ వర ప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నేడు మంచిర్యాల జిల్లాకు రానున్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించిన అనంతరం క్యాతన్‌పల్లిలోని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నివాసానికి చేరుకోనున్నారు. అక్కడ మధ్యాహ్న భోజనం చేయనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

## యువత సన్మార్గంలో నడవాలి

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జూలై 25 : యువత గంజాయికి అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, సన్మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపైనే ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కోరంగి మాలశ్రీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జాదోవ్ రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శులు వడ్లూరి శ్రీకాంత్, ఆత్మకూరి సతీష్ పాల్గొన్నారు.

రైతుబంధు

# భట్టి బడ్జెట్‌పై పెదవి విరుపు





- నిరాశ పరిచిన కాంగ్రెస్ పద్దు..
- జిల్లాకు నిధుల కేటాయింపుపై రిక్త'హస్తం'
- వరద విపత్తు నివారణకు ప్రత్యేక నిధులేవీ?
- చెన్నూర్, పడ్తనపల్లి లిఫ్టులు పక్కన పడినట్లే..
- ఆగిపోయిన అభివద్ధి పనుల కొనసాగింపుపై నో క్లారిటీ
- రైతుబంధు, రైతు భరోసాపై స్పష్టత కరువు
- పథకాలపై ప్రకటనలు, నిధుల కేటాయింపులు చేయలేదు
- ఇదేం బడ్జెట్ అంటూ పెదవి విరుస్తున్న ప్రజలు

మంచిర్యాల, జూలై 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై జిల్లా వాసులు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. మొన్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పైసా కూడా ఇవ్వకపోవడంతో రాష్ట్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ, ప్రభుత్వం అంకెల గారడీ తప్ప.. పథకాలకు ఇచ్చిందేమీ లేదు. ఇదేం బడ్జెట్ అంటూ జనాలు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయానికి రూ. 72 వేల కోట్లు అంటూ గొప్పగా ప్రకటించినా.. రైతుబంధు, రైతు భరోసా పథకాలేవీ బడ్జెట్‌లో రాలేదు. పైగా గత ప్రభుత్వం రైతుబంధు పథకంతో రైతులకు డబ్బులిచ్చి దుబారా చేసిందంటూ ఆర్థిక మంత్రి మాట్లాడడంతో రైతులు మండిపడుతున్నారు. రైతులకు ఇచ్చిన డబ్బులు వృథా చేసినట్లా అని ప్రశ్నిస్తున్నారు. మంత్రి ప్రసంగంతో రైతు వ్యతిరేక ప్రభుత్వమని కాంగ్రెస్ చెప్పకనే చెప్పిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి పనులను కొనసాగించేలా బడ్జెట్‌లలో కేటాయింపులు ఉంటాయని భావించారు. ఒకవేళ అవి చేయలేకపోతే కొత్త పథకాలైనా ఉంటాయనుకున్నారు. కానీ కొత్త పథకాలు లేకపోగా దళితబంధు, మత్స్యకారులకు, గొల్లకురుమలకు చేయూత అందించే అనేక పథకాలకు సర్కారు మంగళం పాడింది.

- గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పట్టణాలు, గ్రామాలు, వ్యవసాయ భూములు ప్రతి వర్షాకాలం మునిగిపోతుంటాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపించేందుకు నిధులు ఉంటాయని అంతా భావించారు. మంచిర్యాల పట్టణానికి సంబంధించి గోదావరికి కరకట్టలు కట్టేందుకు గత ప్రభుత్వం రూ.235 కోట్లతో ప్రతిపాదించిన నిధులకు ఈ బడ్జెట్‌లో మోక్షం కలుగుతుందనుకుంటే నిరాశే మిగిలింది.
- గోదావరి నది మీదుగా మంచిర్యాల– అంతర్గాం బ్రిడ్జి పనులకు కేసీఆర్ సర్కారు నిధులు ఇచ్చింది. శంకుస్థాపన జరిగి పనులు సైతం మొదలుపెట్టారు. కాంగ్రెస్ గెలిచాక ఆ పనులను అర్థాంతరంగా ఆపేసింది. దాని స్థానంలో ముల్కల్ల నుంచి ముర్మూర్‌కు బ్రిడ్జి వేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కానీ, ఈ బడ్జెట్‌లో దానికి నిధులు ఇచ్చారా.. ఇవ్వలేదా అనేది తెలియదు. రోడ్లు, భవనాలకు ప్రతిపాదించిన బడ్జెట్ నుంచి వాటికి అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంది. దీంతో మంజూరైన బ్రిడ్జిని ఆపేసి, కొత్త బ్రిడ్జి అని చెప్పి నిధులపై స్పష్టత ఇవ్వకపోవడంతో జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు. రెంటికీ చెడ్డ రేవడిలా మారిపోయిందని మండిపడుతున్నారు.
- బీఆర్ఎస్ సర్కారు హయాంలో శంకుస్థాపన చేసుకున్న చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్, పడ్తనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను అసలు పట్టించుకోనే లేదు. తలాపున గోదావరి ఉన్నా చుక్క నీరు కూడా వాడుకునే పరిస్థితి లేదనే మంచిర్యాల జిల్లా వాసుల బాధను పరిగణలోకి తీసుకొని మంచిర్యాలతో పాటు చెన్నూర్ నియోజకవర్గంలో వేల ఎకరాలకు సాగునీరిచ్చే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు వీటికి శంకుస్థాపనలు చేసింది. బడ్జెట్ వీటి ప్రస్తావన లేకపోవడంతో జిల్లాకు సాగు నీరు అందించే ప్రాజెక్టులను సర్కారు పక్కన పెట్టేసినట్లు అయ్యింది.
- జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, బెల్లంపల్లి ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, ఐటీ హబ్, సింగరేణి కార్మికుల సంక్షేమం.. ఇలాంటి అంశాలను బడ్జెట్‌లో పరిగణలోకే తీసుకోలేదు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టి మధ్యలో ఉన్న అభివద్ధి పనులకు నిధులొస్తాయనుకుంటే అది.. జరగనే లేదు. మొత్తానికి కాంగ్రెస్ సర్కారు బడ్జెట్ అన్ని రంగాలకు నిరాశ మిగిల్చింది.

**నిధుల సాధనపై నాయకులు గురి పెట్టాలి..**

ఆశించిన జిల్లాకు ప్రత్యేక కేటాయింపులేమీ లేకపోయినా.. సంక్షేమానికి, పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధికి, రోడ్లు భవనాల శాఖకు, ఇరిగేషన్ శాఖలకు కేటాయించిన నిధుల నుంచి అత్యధిక నిధులు జిల్లాకు తీసుకురావడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రయత్నించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాల్లో.. 4 కాంగ్రెస్ గెలిస్తే అందులో మూడు స్థానాలు మంచిర్యాల జిల్లాలోనే ఉన్నాయి. ముగ్గురు ఎమ్మెల్యేలకు సీనియర్ లీడర్లుగా, కాంగ్రెస్ పార్టీలో కీలకమైన వారిగా గుర్తింపు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యేలు పోటీ పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. మరి ఈ విషయంలో ఎమ్మెల్యేలు జనాలను సంతృప్తి పరుస్తారా.. లేదా అన్నది వేచివేచి చూడాలి.

## జిల్లాకు నిరాశే..

- ఏ ఒక్క అభివృద్ధికీ నిధులు కేటాయించని కాంగ్రెస్ సర్కారు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వివక్షకు నిదర్శనమంటున్న ప్రజాప్రతినిధులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలకు ముందు ఓట్ల కోసం అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాపై వివక్ష చూపిస్తున్నారు. గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏ ఒక్క అభివృద్ధి పనికీ నిధులు కేటాయించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని గిరిజనులు, ప్రజలు అభి ప్రాయపడుతున్నారు. 40కి పైగా వాగులపై వంతెనలు, వార్ధాపై బ్రిడ్జి, దాదాపు 140కి పైగా గ్రామాలకు రోడ్లు నిర్మించడంతో పాటు కుమ్రం భీం ప్రాజెక్టు కట్టకు మరమ్మతులు.. ఇలా అనేక అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశ కలిగించడంపై విమర్శలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం



అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం చేసింది. ఏ ఒక్క సమస్య పరిష్కారానికి కూడా కూడా నిధులు కేటాయించలేదు. కనీసం కుమ్రం భీం ప్రాజెక్టు మరమ్మతుల కోసమైనా నిధులిస్తుందనుకున్నాం. ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను ఎందుకు కేటాయించలేదో చెప్పాలి.

– కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్

### పట్టించుకోకపోవడం దారుణం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్‌లో కావాలనే ఆదివాసీ జిల్లాకు అన్యాయం చేశారు. అనేక గిరిజన గ్రామాలకు రోడ్లులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగులపై వంతెనలు లేక ప్రాణాలు అరచేతిలోపెట్టుకొని వాటిని దాటుతున్నారు. జిల్లా అభివృద్ధి, సమస్యల గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం.

– కనక యాదవ్‌రావ్, ఆదివాసీ జిల్లా నాయకుడు

### రైతులకు మేలు చేసే బడ్జెట్ కానే కాదు



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రైతాంగానికి ఏ మాత్రం మేలు చేసేది కానే కాదు. రైతుబంధు, రైతు భరోసాకు నిధులివ్వలేదు. దళితబంధు, మత్స్యకారులు–గొల్లకురుమల సంక్షేమం ప్రస్తావనే లేదు. ముఖ్యంగా కొత్త పథకాలకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదు. యేటా వర్షాకాలంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పట్టణాలు, గ్రామాలతో పాటు పంటలు నీటమునుగుతాయి. మంచిర్యాలలో గోదావరికి కరకట్ట నిర్మాణానికి నిధులేవీ కేటాయించలేదు. పడ్తనపల్లి లిఫ్ట్‌ను అసలు పరిగణలోకి తీసుకున్నట్లు లేదు. కేవలం కేసీఆర్ సర్కారును విమర్శించడానికే బడ్జెట్ పెట్టినట్లు అనిపించింది. పదేళ్లలో అన్ని రంగాల్లో పురోగతి సాధించిన గత ప్రభుత్వాన్ని తిట్టడం, చిన్నది చేసి మాట్లాడేందుకు బడ్జెట్ పెట్టినట్లు అనిపించింది. నిర్మాణాత్మక ప్రగతి సాధించే దిశగా ప్లాన్ చేసిన బడ్జెట్ కాదు. దీంతో జనాలకు చేకూరే ప్రయోజనం శూన్యం.

– నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల

### బడ్జెట్ నిరాశపరిచింది



బడ్జెట్ నిరాశపరిచింది. రైతుబంధు, రైతు భరోసాకు నిధులు ఇవ్వలేదు. మహిళా సాధికారిత, పింఛన్లపై స్పష్టత ఇవ్వలేదు. ఆరు గ్యారంటీలు ఇచ్చారు. వాటిలో ఇప్పుడు అమలవుతున్న వాటినే ప్రస్తావించారు తప్పితే కొత్త గ్యారంటీల గురించి ప్రకటనే లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు.. వ్యవహరిస్తున్న తీరుకు అసలు సంబంధమే లేదు. వ్యవసాయానికి రూ.72 వేల కోట్లు ఇచ్చారు కానీ వాటిని వేటీ మీద ఖర్చు పెడతారన్నదానిపై స్పష్టత లేదు.

– అర్నె సమ్మయ్య, రైతు, శివ్వారం

## ఆటో యూనియన్ ఎన్నికలపై రగడ

### పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ





పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ఆటో యూనియన్ నాయకులు

మంచిర్యాల అర్బన్, జూలై 25 : జిల్లాలో ఆటో యూనియన్ ఎన్నికల్లో రగడ రాజుకుంది. అధికార పార్టీ నాయకుల జోక్యంతో యూనియన్ ఎన్నికలను ఏకగ్రీవం చేశారంటూ అసమ్మతి వర్గానికి చెందిన నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు నిర్వహించి కొత్త యూనియన్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఈ పంచాయితీ కాస్త గురువారం రోజు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఇప్పటికే ఎన్నికైన యూనియన్ నాయకుల ఫిర్యాదుతో పోలీసులు ఇరువర్గాల యూనియన్ సభ్యులను పిలిపించి మాట్లాడారు. అసమ్మతి వర్గానికి సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదని తెలిసింది. మంచిర్యాల పట్టణానికి సంబంధించి 21 ఆటో అడ్డాలు ఉన్నాయి. వీరిలో కొందరు ఓ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దగ్గరకు వెళ్లి అధ్యక్షుడిగా ఉండాలని కోరినట్లు తెలుస్తుంది. తాను అధ్యక్షుడిగా ఉండాలంటే మొదటగా మీ పట్టణ అధ్యక్షుడిని ఎన్నుకోండి.. అప్పుడు నేనే అధ్యక్షుడిగా ఉంటానని సదరు నేత వారికి చెప్పినట్లు సమాచారం. ఏకగ్రీవంగా ఎన్నికలు చేద్దామంటే ఎవరూ ఒప్పుకోలేదు. దీంతో నెల క్రితమే ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికల తేదీలు అనౌన్స్ చేసి, నామినేషన్లు వేయగా, ఎన్నికలు నిర్వహించే సమయంలో ఓ నాలుగు అడ్డాలకు చెందిన వ్యక్తులు హాజరు కాలేదు. మిగిలిన 16 అడ్డాల నుంచి ఐదుగురు నామినేషన్ దాఖలు చేయగా, అందులోనుంచి ముగ్గురు విత్‌డ్రా చేసుకున్నారని, మిగిలిన ఇద్దరిలో అధ్యక్షుడిగా ఒకరు, ఉపాధ్యక్షుడిగా మరొకరిని ఎన్నుకున్నారని యూనియన్‌లోని ఓ వర్గం చెబుతున్నది. ఇలా ఎన్నికల ప్రక్రియ ముగిశాక కొత్తగా పట్టణ ఆటో యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు కొందరు సిద్ధమయ్యారని ఆరోపిస్తున్నారు. దీనిపైనే ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామంటున్నారు. మరోవర్గం మాత్రం ఎన్నికలు నిర్వహించలేదని, ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారని, కచ్చితంగా ఎన్నికలు నిర్వహించి తీరుతామని చెబుతున్నారు. ఆటో యూనియన్ ఎన్నికల్లో అధికార పార్టీ జోక్యం చేసుకుంటుందంటూ మండిపడుతున్నారు. దాదాపు 60 మంది సంతకాలు పెట్టి ఎలక్షన్లు వాయిదా వేయాలని కోరినా పట్టించుకోకుండా వాళ్లకు వాళ్లే నాయకులను ఎన్నుకున్నారంటున్నారు. పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎన్నికలు ఆపాలని కోరుతున్నారని, తాము ఎలాగైనా ఎన్నికలకు వెళ్తామని,. ఈ విషయంలో పోలీసులు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై మంచిర్యాల సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం ఉన్న యూనియన్ నాయకులు ఫిర్యాదు ఇచ్చారని, వారిని పిలిపించి ఏసీపీ మాట్లాడారని చెప్పారు. ఈ ఆటో యూనియన్ల పంచాయతీ ఎక్కడి దాకా వెళ్తుందో చూడాలి మరి.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ఖైర్‌గూడ ఓసీపీలో వన మహోత్సవం



ఖైర్‌గూడ ఓసీపీలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, జీఎం రవిప్రసాద్

రెబ్బెన, జూలై 25 : పర్యావరణ పరిరక్షణలో అందరు భాగస్వాములు కావాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ లు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఏరియా లోని ఖైర్‌గూడ ఓసీపీలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. మొక్కలు నాటడం ద్వారా భవిషత్తు తరాలకు మంచి చేసిన వారు అవుతారని అన్నారు. పర్యవరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగం కావాలని భవిషత్తు తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందించటం కొసం కృషి చేయాలని కొరారు. చెట్లు, అడవులు లెకపొతే వర్షాలు పడక దుర్బర పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా ఎస్‌వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, సీఎంవోఏఐ అధ్యక్షుడు మధుసుదన్, ప్రాజెక్టు అధికారులు సత్యనారాయణ, ఉమాకాంత్ లతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం
- కుష్నపల్లి పాఠశాల పరిశీలన



కుష్నపల్లి పాఠశాలలో గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నెన్నెల,జూలై 25 : విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సత్వరమే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అధికారులను ఆదేశించారు. గురవారం మండలంలోని కుష్నపల్లి పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. వర్షాలకు విద్యార్థులు తరగతి గదుల్లో గొడుగులు పట్టుకుని పాఠాలు వింటున్న తీరుపై పత్రికల్లో కథనాలు రాగా, ఆయన పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల గోడలు, స్లాబ్ పూర్తిగా తడిసి ఉండటాన్ని గమనించారు. తరగతి గదులు చిత్తడిగా మారడంతో వరండాలో బోధన సాగిస్తున్నారు. తరగతి గదులు, స్లాబ్‌ను వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులెవ్వరూ గదుల్లోకి వెళ్లకుండా చూడాలని సూచించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. భోజన వసతితో పాటు వారికి అందిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నెన్నెలలోని ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీవారు.ఆయన వెంట జిల్లా విద్యాధికారి, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, తహసీల్దార్ రమేశ్, ఎంఈవో మహేశ్వర్ రెడ్డి, ఆర్ఐ గణేశ్, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

### ఇన్‌చార్జి హెచ్‌ఎం సస్పెన్షన్

నెన్నెల, జూలై 25 : కుష్నపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇంద్రసింగ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తరగతి గదుల్లోకి వర్షపు నీరు రావడంతో విద్యార్థులు గొడుగులు పట్టుకొని కూర్చోవడంపై పత్రికల్లో కథనాలు రాగా, కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం పరిశీలించారు. అదనపు గదులున్నా, అందులో కూర్చుండబెట్టకుండా.. కావాలని గొడుగులు పట్టించి నీరు లీకవుతున్న గదుల్లో కూర్చుండబెట్టిన కారణంగా సదరు స్కూల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల తీరుపై మండి పడుతున్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం ఆయన ఎంతో కృషి చేశాడని, అధికారులు గ్రామంలో ఉంటే పరిస్థితి ఏమిటో తెలిసేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679